పక్షుల కిలకిలరావాలు వినబడుతున్నా సూర్యకిరణాలు కిటికీలో నుండి సూటిగా నా ముఖాన్ని తాకుతున్నా రేడియోలో నుండి సుప్రభాతం వినబడుతున్నా మెలుకువతోనే వున్న నాకు మంచం మీద నుండి క్రిందకి దిగడానికి బద్ధకంగా వుంది.

కళ్లు మూసుకుని అలాగే ఆలోచిస్తూ పడుకున్నాను. అంతలో టీ కప్పుతో వచ్చి అమ్మ తట్టి లేపింది.

# కనువిప్పు

## నిశ్చల సిద్ధారెడ్డి

''ఏయ్ పెద్దపాపా! లేలే చాలా వేళయింది. ఇంకా ఏం మొద్దునిద్ర'' అంటూ లేపి కూర్చోబెట్టి టీకప్పు చేతికిచ్చింది.

కప్పు టేబుల్‌పై పెట్టి బాత్రూంలోకి నడిచి చకచకా బ్రష్ చేసుకుంటున్నాను త్వరగా బ్రష్ చేసుకుని బయటపడకపోతే టీ చల్లారిపోతుందని కంగారు. ఇంతలో నాన్నగారు న్యూస్‌పేపర్ పట్టుకుని హడావుడిగా పరుగులాంటి నడకతో వచ్చారు.

''పెద్దపాపా మీ బిఎల్ రిజల్ట్స్ వచ్చాయి. నీకు ఫస్ట్‌క్లాస్ వచ్చింది కంగ్రాట్స్ డియర్'' అంటూ వచ్చి గుండెలకు హత్తుకున్నారు. నా నోట్లో బ్రష్ నోట్లోనే వుండిపోయింది. ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. నాకు తెలీకుండానే ఆనందంతో కంట్లో నీరు. చెప్పొద్దూ ఏనుగెక్కినంత సంబరంగా వుంది. నాకు క్లాసు వచ్చినదానికంటే నా విజయంవల్ల నా కన్నతల్లిదండ్రులు పడే ఆనరదం చూస్తుంటే నా ఆనందం పదింతలయింది. నా జీవిత ధ్యేయం నెరవేరింది. నేను లాయర్నయ్యాను. ఇదంతా నాకు కలగా ఉంది. కలకాదు నిజమంటూ నా చెల్లి, తమ్ముడు నా బుగ్గలపై ఇచ్చిన ముద్దులు తెలిపాయి.

నిరంతరం స్త్రీకి విద్యే ఆయుధమని విద్యే ధనమని, విద్యే శక్తని నన్ను ఉత్తేజపరిచి ఉత్సాహపరచి పరీక్షల సమయంలో రాత్రింబవళ్లు చదివిన నాతోపాటు నాకు తోడుగా మేలుకుని ఎన్నో నిద్రలేని రాత్రిళ్లు గడిపిన నా కన్నతల్లి కళ్లల్లోని ఆనందం ఎన్ని కోట్ల రూపాయలిస్తే చూడగలను. నా మనసంతా అవ్యక్తానందంతో, తృప్తితో నిండిపోయింది. విద్యార్థి జీవితంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన అతి విలువైన, అపురూపమైన బహుమతి ఈ విజయాలేనేమో!

ఆడపిల్లలకు తగినంత చదువు చాలు ఇంకా ఎక్కువ చదివితే నీకంటే ఎక్కువ చదివిన వాడిని వెదికి తేలేమని నా చదువును ఇంటర్ నుండే ఆపించాలని విశ్వప్రయత్నం చేసి చివరికి నా మొండివైఖరి భరించలేక కొద్దిగా కోపంతోనే నన్ను చదివించిన నాన్నగారు ఈనాడు నన్నుచూసి గర్వంతో, ఆనందంతో చిరునవ్వు చిందిస్తున్నారు. ఆ చిరునవ్వుకు నా హృదయం గర్వంతో ఉప్పొంగింది. ఈ క్షణాలిలాగే నిలిచిపోతే బాగుండుననిపించింది.

ఆ సాయంత్రం నా ఈ విజయాన్ని నా కుటుంబ సభ్యులతో కలసి విశాఖ రామకృష్ణ బీచ్‌లో ఆనందంగా సెలబ్రేట్ చేసుకున్నాను. డాల్ఫిన హోటల్లో డిన్నర్ తీసుకుని ఇంటికొచ్చాను.

మరునాటి ఉదయం నాన్నగారు నన్ను దగ్గరగా



### కథ వెనుక కథ

ఇంటర్ చదివే రోజుల్లో జరిగిన యాక్సిడెంట్ సంఘటన నా మనస్సులో ముద్రించుకుపోయి అప్పుడప్పుడూ నన్ను కలచివేసేది. ఈ సంఘటనే నా ఈ కథకు స్ఫూర్తి. కథలోలా నేనూ ఆలోచించి 'లా' చేసాను. కానీ ఆలోచనకు, వాస్తవాలకు, ఆదర్శాలకు నక్కకూ నాగలోకానికీ వున్నంత తేడా వుందని వయసు పెరిగేకొద్దీ అర్థం చేసుకోగలిగాను. టీనేజ్‌లో సమాజానికి ఏదేదో చేయాలని తలంపులతో ఉవ్విళ్లూరిన నేను వయసు తెచ్చిన పరపక్వతతో నిజ జీవితానికి, ఆదర్శాలకు, కలలకూ ఎంతో తేడా వుందని గుర్తించగలిగాను. ఈ కలం పట్టుకోవడం అనే ప్రక్రియ ఆంధ్రభూమిలోనే మొదలుపెట్టాను. కొన్ని భావకవితలు ఇంతకు ముందు ప్రచురితమయ్యాయి. డిగ్రీ నుండి భూమి మిస్ కాకుండా చదవడం నా అలవాట్లలో ఒకటి. నన్నింత విద్యావంతురాలిగా తీర్చిదిద్దిన నా కన్నతల్లికి నా ఈ కథ అంకితం.


–నిశ్చల సిద్ధారెడ్డి
కేరాఫ్ పి.వి.ఎస్.రెడ్డి
నెం.486, 19వ మెయిన్
32వ క్రాస్, ఫోర్త్ 'టి' బ్లాక్
జయానగర్, బెంగుళూరు.

తీసుకుని ''తల్లీ! ఆడపిల్లకు చాకలిపద్దులు చూస్కునేంత చదువు చాలంటే ఎన్నో విధాలుగా మొండిపట్టు పట్టి నీ పేరు పక్కన ఎంఏ బిఎల్ అనిపించుకున్నావు. మొత్తానికి బిఎల్ పట్టా అందుకున్నావు. వాట్ నెక్ట్స్? ఎంఎల్‌కు ఎంట్రెన్స్ రాస్తావా? ప్రాక్టీస్ చేస్తావా? పెళ్ళి చేసుకుంటావా? ఇక ఈ లాయరమ్మతో వాదించే శక్తి, ఓపిక నాకు లేవు. ఛాయిస్ ఈజ్ యువర్స్'' అన్నారు. నా ఆనందం వర్ణనాతీతం.

నా ఈ విజయాలు నాన్నగారిలో నామీద నమ్మకాన్ని పెంచినట్లున్నాయి. అందుకే ఈ విధంగా మాట్లాడుతున్నారు. నాన్నగారి ఆలోచనల్లోని మార్పుకు ఆశ్చర్యానందాలకు లోనయ్యాను. నాన్నగారిని గట్టిగా హత్తుకుని ధృడచిత్తంతో చెప్పాను. ''నాన్నగారూ! ఇక ప్రాక్టీస్ చేస్తాను. లాయర్ సరస్వతిదేవిగారి దగ్గర జూనియర్‌గా చేద్దామనుకుంటున్నాను'' అని నా నిశ్చయాన్ని నిస్సంకోచంగా చెప్పాను. నాన్నగారి గ్రీన్‌సిగ్నల్‌తో మా కుటుంబానికెంతో హితులు, ఆప్తులు అయిన లాయర్ సరస్వతిదేవిగారివద్ద జూనియర్‌గా జాయిన్ అయ్యాను.

మంచిరోజు చూసుకుని ఆఫీసుకెళ్లాను. అక్కడ సరస్వతిదేవిగారి అభినందనలు అందుకున్నాక గుమస్తా గురునాథంని పరిచయం చేసారావిడ. గుర్నాథంగారు పక్కగదిలోకి తీసుకెళ్లి నాకు ఒకొక్కటీ వివరంగా వివరించారు. ఏ పని ఎలా చేయాలీ, నా డ్యూటీస్ అన్నీ ఓపిగ్గా వివరించి చెప్పారు. అక్కడే పని చేసుకుంటున్న నాకంటే సీనియర్స్ అయిన జూనియర్ లాయర్లతో పరిచయం చేసారు. అందరూ చాలా ఫ్రెండ్లీగా వున్నారు.

కొద్దికాలంలోనే అన్ని పన్లు ఏకాగ్రతతో నేర్చుకుని ఆఫీస్‌లో నాతోటి జూనియర్లందరికంటే మెరుగని అందరితో పొగిడించుకోగల స్థాయికి వచ్చాను. సంపాదన గురించి నాకు చింతలేదు. డబ్బు సంపాదన కోసం నేనీ లాయర్ వృత్తిలోకి రాలేదు. పేద ప్రజలకు సహాయం చేయాలి, దీనులను ఆదుకోవాలీ ఇదే నా ఆదర్శాలు,



ఆశయాలు, ఆశలు, కలలు. ఈ ఆలోచనల వెనుక ఏ దురాలోచనాలేదు. నా కుటుంబ సభ్యులు నా ఆలోచనలను, ఆశయాలను 'ఎర్రని ఆదర్శాలని' పేరు పెట్టి నన్నూ ఆట పట్టిస్తుంటారు. కానీ అవి ఎర్రటివో, తెల్లటివో నాకే తెలీదు. రంగేదైతేనేం అవసరాల్లో వున్న పేదవారిని ఆదుకోవాలి అదే నా ధృడసంకల్పం.

ప్రతిరోజూ ప్రొద్దుటే 7.00కల్లా ఆఫీసుకెళ్లడం, 10.30 వరకు ఆఫీసు పని చూడ్డం, 10.30 తరువాత కేసులున్న రోజు సరస్వతిదేవిగారితో కోర్టుకెళ్లి కేసులు వాదించేటప్పుడు తలలు పండిన న్యాయవాదుల వాదోపవాదాలతో ఒక్కొక్క పాయింట్‌ను అతి నేర్పుగా తెలివిగా వారు వాదించే విధానాన్ని నిశితంగా గమనించడం వీటన్నింటినీ నా బుర్రలోనే నోట్ చేసుకోవడం, మళ్లీ సాయంత్రం ఆఫీసుకు వెళ్లడం, పని నేర్చుకోవడం ఇవే నా దైనందిన కార్యక్రమాలు. ఒక్కోసారి ఆదివారాలు కూడా ఆఫీసుకెళ్లిపోయేదాన్ని. అమ్మ అప్పుడప్పుడు సణుగుతూనే వుండేది. నేనీ మధ్య నా కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయాన్ని గడపలేకపోతున్నానన్నదే కారణం. నేనెలాగైనా స్వంతంగా నాకై నేను ఆఫీస్ ఓపెన్ చేసి కేసులు వాదించి మంచి పేరు తెచ్చుకోవాలి. ఇదే నా ధ్యేయం. రాత్రింబవళ్లు దానికోసమే నా ఈ కృషి.

ఈరోజు కోర్టుకు వెళ్లే పనిలేదు. ప్రొద్దుటే ఆఫీసుకు వచ్చా. రాగానే గుర్నాధంగారు నన్ను చూసి విశాలంగా నవ్వారు. ప్రతిగా నేను చిరునవ్వు చిందించాను. నాకర్థమైపోతూనే వుంది. ఎప్పుడూ భావరహితంగ నవ్వడమే తెలీనట్లుండే ఆయన నవ్వారంటే నాతో చాల పెద్ద పనే చేయించేలా వున్నాడు. అనుకున్నట్టే చెప్పారు ''అమ్మాయ్ నీవు చాలా చక్కగా టైప్ చేస్తావటగా మొన్నొచ్చినప్పుడు మీ అమ్మగారు మేడంతో చెబుతుంటే విన్నాను. కాస్త ఈ ముప్పై పేపర్లు సాయంత్రానికల్లా ఏమనుకోకుండా టైప్ చేయమ్మా. ఆహా... పర్లేదు. మెల్లిగానే చేయి. ఇది నీ పని కాకపోయినా చెబుతున్నానని ఏమీ అనుకోకు. మరి నేను మా పెద్దమ్మాయి కూతురు బారసాలకు గాజువాక దాకా వెళ్లిరావాలి. ఇంట్లో వేడుక. వెళ్లక తప్పదాయె. నేనొచ్చేపాటికి ఏ సాయంత్రమో అవుతుంది. రాత్రి 8.30కల్లా లాయరమ్మచేత సంతకాలు చేయించుకోవాలి. రేపు కోర్టులో వాదించబోయే కేసుకు సంబంధించిన కాగితాలివి. అందుకే నీకప్పగించాను. తప్పులేదు. ఏమీ అనుకోకు. బంగారుతల్లి కాస్త నిదానంగా తప్పుల్లేకుండా టైప్ చేసేయమ్మా'' అప్పగింతలు పెడుతూనే వెళ్లిపోయారు.

## పెళ్లికి ముందు

''డాక్టరు రిపోర్టు వచ్చింది పంకజం. లోపం నీలోనే ఉందట. నీకు పుట్టుకలోనే గర్భసంచీ లేదట''

''ఈ డాక్టర్ల రిపోర్టులు నమ్మలేమండీ. మా ఫ్యామిలీ డాక్టర్ రాధాదేవి గారి నడగండీ. పెళ్లికి ముందు రెండుసార్లు అబార్షన్ చేసినప్పుడు ఆ విషయమే చెప్పలేదు''

-వి.వి.సీతారామ్‌దాస్ (గుంటూరు)

నాకు అమ్మమీద పికలదాకా కోపమొచ్చింది. ఈవిడెప్పుడూ ఇంతే. ఎవరూ అడక్కుండా నా గురించి నా చదువు గురించి ఆనందంగా బోలెడు గొప్పలు చెబుతుంది. వాళ్లేమో అప్పుడు వినేసి తరువాత ఇదిగో నన్నిలా వాడుకుంటూ ఉంటారు. వాళ్లల్లో ఈ గుర్నాధం కూడా కల్సిపోయారు.

మెల్లగా పేపర్స్ అన్నీ తీసుకుని వర్సలో పెట్టే టైప్ చేయడం మొదలుపెట్టాను. టైప్ చేస్తూనే మెల్లగా ఆలోచనలు మొదలుపెట్టాను. అసలు నేను లాయర్ అవుదామని కలలో కూడా అనుకోలేదు. ఇంటర్‌లో బైపిసి గ్రూప్ తీసుకున్నాను డాక్టర్‌ని అవ్వాలని ఆశతో. కానీ లాయర్నయ్యాను. ఇదే విధి విచిత్రమేమో. ఊహూ ఇది విధికాదు. నాకు నేనే కావాలని లాయర్‌నయ్యాను. గతం మెల్లగా కళ్లముందు కదలాడసాగింది.



మేమప్పుడు నెల్లూరు జిల్లాలోని కావలి అనే అటు పల్లె ఇటు పట్నంగానీ ఊర్లో ఉండేవాళ్లం. నేను ఇంటర్‌వరకు అక్కడే చదివాను. కావలి విశ్వోదయ స్కూలులో పదవ తరగతి ఫస్టుక్లాసు మార్కులతో పాసయ్యాను. జవహర్‌భారతి కాలేజీలో ఇంటర్ బైపిసి గ్రూప్‌లో జాయిన్ అయ్యాను. ఇంటర్‌లో చేరింది మొదలు డాక్టర్ అయిపోవాలని కలలు కనేదాన్ని. కనబడ్డ డాక్టర్లను కళ్లప్పగించి చూసేదాన్ని. డాక్టర్నవ్వడమే నా జీవితాశయంగా పెట్టుకున్నాను. రెయ్యింబవళ్లు చదివేదాన్ని. ఫస్టు ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చాయి. సెకండ్ ఇంటర్‌లోకి వచ్చాను.

ఇంటికి కాలేజీకి కనీసం రెండు మైళ్ల దూరముండేది. కాలేజీకి అమ్మాయిలందరం నడిచే వచ్చేవాళ్లం. నడిచే వెళ్లేవాళ్లం. అబ్బాయిలు మాత్రం సైకిళ్లపై అమ్మాయిల్ని కామెంట్స్ చేసుకుంటూ జాలీగా, జోరుగా వెళ్లేవాళ్లు. కావలి పల్లెకాదు పట్నంకాదు. ఎటూగానీ ఊరు. అమ్మాయిలంతా ఈ వాతావరణానికి తగ్గట్టు ఒద్దిగ్గా సాంప్రదాయకంగా ఓణీల్లోనే కాలేజీకి వచ్చేవాళ్లు. ఇప్పుడంతా మోడ్రన్ అయిపోయుంటుందిలే. కాలం మారిందిగా మరి.

కాలేజీలో అన్ని క్లాసులకు చక్కగా అటెండ్ అయ్యేవాళ్లం. మా బ్యాచ్ అంతా చాలా బాగా చదివేవాళ్లం. మెరిట్ బ్యాచ్ అని ఇంగ్లీష్ లెక్చరర్ రత్నాజోసెఫ్‌గారు, బోటనీ బసవరాజుగారు, విక్టోరియా మేడం, ఫిజిక్స్ సిఎమ్‌కె సార్, కెమిస్ట్రీ రామకృష్ణ సార్, జువాలజీ సార్ (పేరు మర్చిపోయాను క్షమించాలి) ఆ... వేణుగోపాలరావుగారు ఎంత బాగా టీచ్ చేసేవారని. ఆ రోజులు మళ్లీరావు. అవన్నీ గోల్డెన్ డేస్, గోల్డెన్ మెమరీస్. ఇప్పుడు లెక్చరర్స్‌లో ఇంత శ్రద్ధాశక్తులతో పాఠాలు చెప్పేవారు తగ్గిపోతున్నారు. (ఒకవేళ ఎక్కడైనా వుంటే వారందరికీ వినమ్రతతో నా వందనాలు)


సాయంత్రం కాలేజీ వదిలాక మా బ్యాచ్ అంతా అంటే... అనూరాధ, శ్రీలక్ష్మి, కమల, గీత, రాజ్యలక్ష్మి, హారిత మెల్లగా క్లాసులో రామకృష్ణసార్ వేసిన జోకులు మళ్లీ మళ్లీ చెప్పుకుంటూ నడుస్తున్నాము. ఈరోజు కాలేజీ కొంచెం తొందరగా వదిలారు. లాస్ట్ అవర్‌లేదు. అబ్బాయిలు అమ్మాయిల్ని కామెంట్స్ చేసుకుంటూ జుయ్‌మని సైకిళ్లపై వెళ్లిపోతున్నారు. వాతావరణం మా కబుర్లతో

## బ్రహ్మానందం కవిత

ఈమధ్య బ్రహ్మానందం తనకు జరిగిన సన్మానం సందర్భంలో ఈరోజుల్లో కవితలు ఎలా ఉన్నాయో, కవిత్వం రాయడం ఎంత తేలికయిపోయిందో చెబుతూ 'నేనొక లుంగీ కొన్నాను. నేనొక గళ్లలుంగీ కొన్నాను. నేనొక లుంగీ కొన్నాను. నేనొక గళ్లలుంగీ కొన్నాను' అంటూ సభికుల్ని నవ్వుల్లో ముంచెత్తాడు. సభలోంచి 'ఇంతకీ ఆ లుంగీ ఎక్కడ?' అడిగేసరికి 'నేనొక గళ్ల లుంగీ కొన్నాను' అంటూ సభికుల్ని నవ్వుల్లో ముంచెత్తాడు.

-క్రిటిక్



చాలా ఆహ్లాదంగా వుంది. రేపు జువాలజీ ప్రాక్టికల్స్‌లో చేయాల్సిన ఫ్రాగ్ డిసెక్షన్ గురించి శ్రీలక్ష్మి నేను చెప్పుకుంటున్నాం. శ్రీలక్ష్మి నేను ప్రాణస్నేహితులం. ఎల్‌కెజి నుండి ఒకే మాట, ఒకే బాట. (శ్రీలక్ష్మి తర్వాత డ్రాపైంది. ప్రస్తుతం అమెరికాలో తన భర్తతో వుంటోంది.)

మా తోవలో యానాది వాళ్ల గుడిసెలు ఒక నలభై, ఏభై కుటుంబాలు వుంటాయి. వాటిని దాటుకుని వెళ్లాలి మేము. ఎప్పుడూ ఆ గుడిసెల ముందు ఎవరో ఒకరు తగువులాడుకుంటూనో, పెద్ద పెద్ద గొంతులతో అర్థమయి కానీ భాషలో కబుర్లాడుకుంటూనో ఉంటారు.

నేనక్కడికి రాగానే మాలచ్చిమి ఇంటికేసి చూడ్డం నా దినచర్యలో ఓ భాగం. మాలచ్చిమి మా ఇంట్లో నా చిన్నప్పటి నుండి పని చేస్తోంది. దాని మొగుడు ఓ పచ్చి తాగుబోతు. రిక్షా లాగి సంపాదించినదంతా సాయంత్రానికల్లా తాగేసి మాలచ్చిమి కష్టపడి సంపాదించినదే తిని దాన్నే చితకబాదుతుంటాడు. ఇదే సంసారాన్ని ఈదాలి. దానికి తోడు దానికొక కొడుకు, కూతురు. వీరుగాక వీళ్లమ్మ, అయ్య. పోతూ పోతూ దీని చెల్లి రమణ బాధ్యతను దీని నెత్తిపై పెట్టి చల్లగా పైలోకాలకు జారుకున్నారు. రమణకు ఏడెనిమిదేళ్లుంటాయి. రోజూ నేనటు రాగానే కళ్లు విప్పార్చుకుని చూస్తుంటుంది. ఒక్కోసారి ముప్పై రెండు పళ్లు బయటపెట్టి ఇకిలిస్తుంటుంది. లేదంటే చెయ్యూపుతూ వుంటుంది. మరీ తిక్కపెడ్తే నా దగ్గరకొచ్చి ''పెద్దపాపగారూ మీరు భలే బాగున్నారు'' అనేసి తుర్రుమంటుంది. దాని డైలాగులకు మా ఫ్రెండ్స్ అంతా పగలబడి నవ్వుకుంటాం. ఈ రోజు అలాగే దూరం నుండి రమణ కనబడింది. శ్రీలక్ష్మి అంటూనే వుంది ''అమ్మడూ నీ కోసం ఎదురుచూస్తూ వున్నట్టుంది'' అని.

మేము దగ్గరకు రాగానే రమణ ''పెద్దపాపగారూ మీరీరోజు భలే బాగున్నారండీ'' అంటూ తుర్రుమని మా ముందుకు పరుగుతీసింది. అంతలో ఎదురుగా రాకాసిలాంటి బస్సొచ్చి రమణను ఒక్క గుద్దు గుద్దడమేంటి రమణ విరుచుకుపడడమేమిటి, బస్సు ముందు చక్రం రమణ తల మీద నుండి పోవడమేంటి ఒక్క ఐదు సెకన్లలో జరిగిపోయింది. చేష్టలుడిగి మేమందరం రోడ్డుపైనే నిలబడిపోయాము. బిలబిలమని చుట్టూ జనం పోగయిపోయారు. కొద్దిసేపటికి తేరుకుని జనాన్ని తోసుకుని ముందుకెళ్లి చూస్తే ఇంకేముంది? రమణ తలపై బస్సు చక్రం పోవడంవల్ల రెండుగా విచ్చుకుని పుర్రె బయటకొచ్చి రక్తం ఒడుతోంది. బక్కచిక్కిన ఆ శరీరంలో రక్తం కూడా చాలా తక్కువగా వున్నట్టుంది. నా తల తిరగడం మొదలుపెట్టింది. మిగిలిన స్నేహితుల్ని అక్కడే వదిలేసి వేగంగా ఇంటికొచ్చిపడ్డాను. అమ్మావాళ్లు ఎంత అడిగినా ఏమీ చెప్పలేకపోయాను. తరువాత కొంతసేపటికి తేరుకుని మెల్లగా చెప్పాను. మూడురోజులు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టలేదు. పదేపదే ''అమ్మాయిగారూ మీరు భలేగున్నారండీ'' అంటూ పరుగెత్తిన రమణే గుర్తొచ్చేది. మనసంతా పాడయిపోయింది.

కాలేజీకి వెళ్లడం ముగించాను. మాలచ్చిమి నాలుగోరోజే పన్లోకి వచ్చింది. కళ్ల నీళ్లు పెట్టుకుని ''పెద్దపాపగోరూ! మా రమణ సూడండి. దేముడన్నేయంగా ఎత్తుకెళ్లిపోనాడు'' అంటూ గోడుగోడున ఏడిచింది.

కొన్నాళ్లకు విషయం పాతబడింది. తరువాత మాలచ్చిమి అమ్మతో చెబుతుంటే విన్నాను. ఆచారిగారు కేసుకు (ఆచారిగారు ఆ ఊర్లో లీడింగ్ లాయరు) పైసా ఖర్చు పెట్టక్కర్లేదని వాళ్ల వాడకొచ్చి మాలచ్చిమికి దాని మొగుడికి చెప్పి వెళ్లారట. బస్ ఓనర్ మీద (అది ప్రైవేటు బస్సు) దావా వేసి వీరికి డబ్బిప్పిస్తానన్నారుట. మాలచ్చిమి మొహం ఆనాటి నుండి కాస్తంత కళకళలాడసాగింది. మధ్యమధ్యలో గుర్తొచ్చినప్పుడల్లా రమణకోసం ఓ ఏడుపేడిచేది. పేదరికంలో ప్రేమలకూ, డబ్బుకూ చాలా దగ్గర సంబంధం వుంటుందనుకుంటా మరి.

నేను కొన్నిరోజుల తరువాత కాలేజీకి వెళ్లసాగాను. తరువాత దగ్గరకొస్తున్న పరీక్షలకోసం సీరియస్‌గా చదివి శ్రద్ధగా పరీక్షలు రాసాను. నా చిట్టచివరి పరీక్ష రాసొచ్చిన రోజు మాలచ్చిమి మా ఇంటికొచ్చి ''చూసారా అమ్మగోరూ ఆ ఆచారిగోరు ఎంత దొంగ సన్నాసో. మాకు నాయం జరిగేటట్టు చూస్తాను, డబ్బిప్పిస్తాను అంటే మనిషెంత మంచోరో ఏటో అనుకున్నాను. చూసారా ఈనాడేం సేసారో మమ్మల్ని.

ఆ బస్సోళ్లు ఐదువేల రూపాయలు ఇచ్చేట్టు కోర్టులో ఒప్పుకుని డబ్బు లాయరుకు ఇస్తే ఈయనేమో 4,500 ఫీజుకింద వుంచేసుకుని మా మొహాన ఐదువందల రూపాయలు కొట్టి మీకిది చాల్లే అని అరిచారు. మా ఉసురు వాడికి తగలకపోదు. దొంగసచ్చినోడు'' అంటూ తిట్లు శాపనార్థాలు పెడుతూనే వుంది. నాకు అది విని తల తిరిగినంత పనైంది. ఆచారిగారంటే అప్పటివరకు వున్న గౌరవం కరిగిపోయింది. దొరికేవరకూ అందరూ దొరలేనన్నమాట. బజార్లో కనబడిన ఆచారిగార్ని చూస్తుంటే అసహ్యమేసింది.

ఎమ్‌సెట్ రాయాలనుకున్న నేను అప్పుడే నిశ్చయించుకున్నాను నా జీవిత గమ్యమేమిటో. ఇంట్లో ఎంత తిట్టినా నచ్చచెప్పినా వినలేదు. ఎమ్‌సెట్ రాయకుండా బిఎల్‌లో జాయినయ్యాను. మేమప్పటికి వైజాగ్ వచ్చేసాము. డిగ్రీ అయ్యాక లాసెట్ రాసి సీటు సంపాదించాను. లా చదువుతూనే ఎం.ఏ. కంప్లీట్ చేసాను. లా అయ్యాక ఇప్పుడిదిగో గుర్నాథంగారి



## అందం

''నీకంటే అందగత్తె ఈ ప్రపంచంలో లేదు'' ఆఫీసు నుంచి రాగానే అన్నాడు సుబ్బారావు.

''వెధవ డొంక తిరుగుడెందుకు, చీర తేవటం ఈరోజూ వాయిదా వేశారన్న మాట'' గయ్యిమంది సుబ్బులక్ష్మి.


-డి.కె.చదువులబాబు (ప్రొద్దుటూరు)



## సెంటిమెంట్

కృష్ణ, సౌందర్య, ఇంద్రజ కలిస్తే నటిస్తే ఆ చిత్రం డెఫినెట్‌గా హిట్ అవుతుందన్న టాక్ మార్కెట్‌లో ఉంది. 'అమ్మదొంగా', 'జగదేకవీరుడు' చిత్రాలు అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అపుడే కృష్ణతో సినిమాలు తీసేవాళ్లంతా సౌందర్య, ఇంద్రజలను జంటగా పెట్టి కథలు వండటం ప్రారంభించారు. సినిమా సెంటిమెంట్ అంటే అలాగే ఉంటుంది మరి.

-క్రిటిక్






దయవల్ల ఆఫీసులో పేపర్లు టైప్ కొడుతున్నాను.

గతం తల్చుకున్నాక నేను తీసుకున్న నిర్ణయం ఎంత ఉదాత్తమైందో, నేను పేద ప్రజలకోసం చేయాల్సిన సేవలు అన్నీ గుర్తుకొచ్చాయి. మళ్లీ దృఢంగా నిశ్చయించుకున్నాను. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురొచ్చినా ఆరునూరైనా నూరుఆరైనా, మిన్ను విరిగి మీదపడ్డా పేదలకు, అవసరం కోసం వచ్చినవారికి ఉచితంగా నా సేవలు అందించాలని నిశ్చయించుకున్నాను. డబ్బు కోసం నేనేం కేసులు వాదించవక్కర్లేదు. తిని కూర్చున్నా తరగనంత ఆస్తి దేముడిచ్చాడు. డబ్బుకోసం నేనేం కక్కుర్తిపడడం లేదు.

గుర్నాధంగారు వచ్చాక అన్నీ అప్పగించి ఇంటికి బయలుదేరాను. ఆఫీసు నుండి బయటకొచ్చి నిలబడ్డ నాకు సముద్రపుగాలి చల్లగా వీస్తూ మనస్సంతా హాయిగా అనిపించింది. నా అయామ్ జస్ట్ గోయింగ్ త్రూ ద మోషన్స్ కాలంతోపాటు నేనూ కదులుతున్నాను. ఇంకొద్దిరోజులు ఇలాగే వుంటుంది. ఆ తరువాత నేనే స్వంతంగా నా కాళ్లమీద నేను నిలబడి స్వంత ఆఫీసు ఓపెన్ చేయగల స్టేజీకి వస్తానని కలలుకంటూ ఇంటికొచ్చేసాను. కలలు చాలా కమ్మగా వుంటాయి.

రెండుమూడురోజుల తరువాత ఆఫీసు ముందు ఎవరో ఇద్దరు భార్యాభర్తలు పెద్ద పెద్దగా ఒకరిపై ఒకరు అరుచుకుంటూ ఏడుస్తున్నారు మధ్యమధ్యలో ఏంటా అని కుతూహలం కొద్దీ బయటకెళ్లి నిల్చున్నాను. వాళ్లు సరస్వతిదేవిగారితో ఏదో వాదిస్తున్నారు. ఆమె మొహమంతా సీరియస్‌గా పెట్టి ''అవును. ఈ డబ్బు నేనే కేసు వాదించినందుకు ఫీజుగా వుంచుకున్నాను. మిగిలిన ఈ వెయ్యి రూపాయలు వుంచండి. మీ కొడుకు ఈ వెయ్యి రూపాయలకంటే విలువేం చేయడులే'' అని విసవిస లోనికి నడిచారు.

ఆ దంపతులను ఆఫీసులోనే ఇంతకుముందు చూసిన గుర్తు. ఆ... గుర్తొచ్చింది. లారీ కిందపడి వాళ్ల రెండేళ్ల కొడుకు చనిపోయాడు. ఆ లారీ ఓనరుమీద, డ్రైవరుమీద మేం కేసు వేసాం. కోర్టులో మా మేడం వాదించారు. రెండు మూడు వాయిదాలకు నేనూ వెళ్లాను. ఆ కేసు ఇంటరెస్టింగ్‌గా అనిపించింది నాకు. కానీ మేడం అక్కడ వాదించిందేమిటి? ఇక్కడ వీళ్లతో చెబుతోందేమిటి? కొంచెం కొంచెం నా బుర్ర విచ్చుకోసాగింది.

ఆవేశంగా ఆమె గదిలోకి వెళ్లి ''మేడం ఇదన్యాయం. కాంపన్సేషన్ పదివేలూ ఆ పేదవారికిచ్చేయండి. ఆ రక్తపుసొమ్ము మనకెందుకు, వాళ్ల శాపాలు మనకు తప్పక తగుల్తాయి'' అని.

మేడం అనుభవంతో కూడిన దీర్ఘమైన నవ్వు నవ్వారు. ''చూడమ్మాయ్. నా సర్వీసు అంత లేదు నీ వయసు. ఈ వయసులో ఆవేశం సహజమే. అదీ నీలాంటి తెలివైన అమ్మాయికి మరీ ఎక్కువ. చెప్పింది చప్పున అర్థం చేసుకో పుస్తకాల్లోని రాతలువేరు, నిజజీవితంలోని చేతలు వేరు. పుస్తకాల్లోని రాతలు, ఆదర్శాలు ఊరికే చదువుకోవడానికి పనికొస్తాయి. బ్రతకడానికి అవి ఉపయోగపడవు. ప్రపంచం మొత్తం డబ్బు మయం. మనిషి పుట్టేది, చదివేది, కష్టపడేది అంతా డబ్బు కోసమే, ఆదర్శాలు, ఆశయాలు అన్నం పెట్టవు. వీలయినంతవరకు వీటికి దూరంగా వుండడమే మేలు, ఆదర్శాలు, ఆశయాలు ఇవన్నీ రాజకీయ నాయకులకోసం. మనలాంటి సామాన్యులకోసం కాదు. నీ అంత వయసులో నేనూ నీలాగా ఆలోచించేదాన్ని. అవే ఆశయాలతో ఈ వృత్తిలోకి కాలుపెట్టాను. కానీ వయసు పెరిగేకొద్దీ అనుభవం అనేక సత్యాలను నా కళ్లముందు ఆవిష్కరించింది. నేడు నేనీ వృత్తి డబ్బు సంపాదన కోసమే చేస్తున్నాను. నీవీనాడు ఉడుకురక్తంతో ఇలా ఆవేశపడుతున్నావు. రేపు నా అంత వయస్సు వచ్చాక నువ్వూ నీ జూనియర్ లాయర్‌తో ఇవే మాటలు రిపీట్ చేస్తావు. అయామ్ ష్యూర్ నో డౌట్. నీవు నాకంటే మంచి లాయర్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తావు. ఓకే కూల్‌డౌన్ బేబీ. రేపు పొద్దుటే ఎర్లీగా ఇక్కడుండాలి. వర్క్‌లోడ్ చాలా ఎక్కువగా వుంది. నౌ యుకెన్ గో'' అన్నారు.



## రేటు

''కమలకి ఫోన్ చేశావా?''
''చేశాను''
''కలవడానికి డేట్ అడిగావా?''
''అడిగాను''
''ఏం చెప్పిందేమిటి?''
''రేటు''

-పి.వి. మురళీకృష్ణ
(హైదరాబాద్)

## స్వర్గం

''స్వర్గం అంటే ఎలా వుంటుంది?'' అడిగాడు గోపి గోవిందాన్ని.
''భార్యలు, బాస్‌లు లేకుండా'' అన్నాడు.

-కలపర్తి సత్యం (ఏలూరు)

వికలమైన మనస్సుతో మ్లానమైన ముఖంతో బయటకొచ్చి దుఃఖంతో విలపిస్తున్న ఆ దంపతుల్ని చూడ్డానికి సిగ్గేసి తలొంచుకునే ఇంటిదారి పట్టాను.

ఇంటికొచ్చి లోపలికి అడుగెయ్యగానే నాన్నగారి గొంతు వినబడుతోంది. ''ఈ సంబంధం మాకన్ని విధాలా నచ్చింది. కానీ మా అమ్మాయిదే సమస్య. ఈ కాలం పిల్లలు కదా పెళ్లి విషయంలో వాళ్లకు సంపూర్ణ స్వాతంత్ర్యాలిచ్చాను. పెళ్లి గురించి ఎస్ప్రెషల్లీ ఈ సంబంధం గురించి తన అభిప్రాయం కనుక్కుని మీకే విషయం కొద్దిరోజుల్లో తెలియజేస్తాను. ఇది తప్పిపోతే మాకంటే బాధపడేవాళ్లు మరొకరుండరు. తను ఒప్పుకుంటుందో లేదో అనేదే అసలు సమస్య'' అంటున్నారు. అర్థమైంది. ఎవరో పెళ్లి సంబంధం కోసమన్నమాట. నన్ను చూడగానే ప్రసన్నమైన ముఖంతో చిరునవ్వు చిందించారు వాళ్లు. ప్రతిగా మర్యాదపూర్వకంగా నేనూ నవ్వాను. నేను నా గదిలోకి వెళ్లి అలసటగా కాళ్లయినా కడుక్కోకుండా కూలబడ్డాను కుర్చీలో.

అమ్మ సంశయిస్తూ లోపలికొచ్చింది. ముఖమంతా ఆనందం నిండి వుంది. ''పెద్ద పాపా! రెండు కొత్త విశేషాలు. ఒకటి మంచి సంబంధమొచ్చింది. అబ్బాయిది మన ఊరే. మనకంటే ఇంకా వున్నవారు. వాళ్లే వెదుక్కుంటూ' వచ్చారు. నిన్నెక్కడో చూసారుట. అబ్బాయి అందంగా వున్నాడు. బాగా చదువుకున్నాడు. నువ్వు ఒప్పుకుంటే పెళ్లి సెటిల్ చేసుకుని ఈ శ్రావణమాసంలోనే ముహూర్తాలు పెట్టుకుందాము. లేదంటే మంచి సంబంధం మిస్ అవుతుంది. అప్పుడు బాధపడి లాభంలేదు''

అసలే విసుగ్గా వచ్చిన నన్ను అమ్మ మాటలు మరింత చికాకు పరిచాయి. విసురుగా టవల్ తీసుకుని బాత్రూంలోకి వెళ్లాను. స్నానంచేసి ఫ్రెష్‌గా అయ్యాను. భోజనం చేయాలనిపించలేదు. నిలకడగా ఆలోచించసాగాను. స్థిరనిశ్చయం మనసులోనే చేసుకుని హాయిగా నిద్రపోయాను.

పక్కరోజు పొద్దుటే నిద్రలేచి తలారా స్నానం చేసి పూజ ముగించాను. అప్పటికే నాన్నగారు నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నారు. అమ్మ గబగబా టీకప్పుతో వచ్చి ''అప్పుడే స్నానం కూడా చేసేసావా? నిన్న రెండో విశేషం చెప్పలేదు కదూ. రోజూ నీవు ఆఫీసుకు నడిచివెళ్లడం కష్టమవుతోందని నాన్నగారు నీకు కైనెటిక్ హోండా కొన్నారు. ఇదిగో తాళం చెవులు. నిన్ను ఆశ్చర్యపరుద్దామని దాన్ని దొడ్లో నీకు కనబడకుండా పెట్టాము. కానీ నీవు నిన్న చికాకు చికాగ్గా త్వరగా పడుకున్నావు. భోజనానికి లేపినా లేవలేదు. అందుకే ఊర్కున్నాము'' అంది.

రాత్రంతా ఆలోచించి తీసుకున్న నిర్ణయం చెప్పాను. ''ఇక దీని అవసరం లేదమ్మా. దీన్ని చెల్లెలికిచ్చేయ్. కాలేజీకు వెళ్లడానికి తనకు ఉపయోగపడుతుంది. నాన్నగారూ పెళ్లి పెళ్లి అని ఎప్పుడూ సతాయిస్తారుగా. ఇక పెళ్లి విషయం మీ ఇష్టం. మీరెలా చెప్తే అలాగే నేనిక ప్రాక్టీస్ మానేస్తున్నాను. అచ్చం అమ్మలాగే చక్కటి హౌస్‌వైఫ్‌నని అందరిచేతా మన్ననలు పొందాలనుకుంటున్నాను'' అన్నాను. చెల్లి, తమ్ముడు నావైపు చిలిపిగా చూసి కన్నుగీటారు. మా ఇంట్లో నవ్వులు వెల్లి విరిసాయి.

అవును పేదల కడుపులు కొడుతూ నేనూ మరో మేడంలా తయారయ్యేకంటే పెళ్లి చేసుకుని ఇంటిపట్టునే వుంటూ నా పిల్లల్ని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే నా ప్రస్తుత కర్తవ్యం. అంతకుమించిన ఘనకార్యమేమీ వుండబోదు. కాదంటారా?

నా నిర్ణయం సరైనదే అని నేను మీతో వాదించలేను. కానీ నా ఆలోచనా పరిధిలో నాకిదే సరైన నిర్ణయం అనిపించింది అంతే.

అబ్బ! నా తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నేనెలా వర్ణించగలను?

★ ★